# మంచి మనిషి

ఆఫీసుల్నించి వచ్చేవాళ్ళతోనూ, స్కూళ్ళనించి వచ్చే పిల్లల్తోనూ, షికారుకి, బజారు పన్లమీదా బయల్దేరిన వాళ్ళతోనూ, బస్సుల్తోనూ, రిక్షా ల్తోనూ, స్కూటర్లతోనూ, సైకిళ్ళతోనూ - అబిడ్స్ నానా హడావిడిగా వుంది. అంత ట్రాఫిక్ మధ్య, ఆ మోతల్ని వింటూ నించోడమంటే కొంచెం ఇబ్బందిగానే వుంది.

విసుగ్గా వాచీ చూసుకున్నాను.

అయిదూ యాభై అయిదు.

'అయిదున్నరకల్లా అబిడ్స్ పోస్ట్ ఆఫీసు దగ్గర కొస్తాను, ఒకవేళ నువ్వు ముందొస్తే నాకోసం ఎదురుచూడు, నేను ముందొస్తే నీకోసం ఎదురు చూస్తూ నిలబడతాను. ఇద్దరం కల్సి అక్కడే దగ్గర్లో ఏదో హోటల్లో కాఫీతాగి, రామకృష్ణలో మొదట ఆట చూద్దాం!' అని తనే ప్రోగ్రామ్ ఫిక్స్‌చేసి మధ్యాహ్నం ఆఫీసుకి ఫోను చేశాడు రామచంద్ర రావు. తను సరిగ్గా అయిదున్నర కల్లా ఇక్కడ ప్రత్యక్షం! కానీ అరు కావస్తున్నా ఇంతవరకూ అంతూ పంతూ లేడు!

చిరాగ్గా వుంది.

నిరీక్షణ ఎంత శాపమో అర్థమవుతూంది.

ఉద్యోగరీత్యా హైదరాబాద్ వచ్చి రెండు నెల్లు కావొస్తుంది. రామ చంద్రరావు తప్ప పెద్ద చెప్పుకోతగ్గ స్నేహితులెవ్వరూ ఏర్పడలేదింకా.



అసలే అందరితోనూ అంత త్వరగా కలిసిపోయే తత్వం కాదు నాది. పైగా కొత్త వుద్యోగం, కొత్త వూరు!

రామచంద్రరావు, నేను బందర్లో డిగ్రీ చదివిన మూడేళ్ళు క్లాస్ మేటు, రూమ్ మేటు. మా ఇద్దరి మధ్యా వున్న బంధమును స్నేహమనే దానికి నిర్వచనంగా చెప్పుకోవచ్చు! ఉద్యోగం వచ్చిందన్న వార్తకన్నా, హైద్రాబాద్ వాస్తవ్యుడ్ని కాబోతున్నాను, మళ్ళీ రామచంద్రరావుతో స్నేహం - ఆ వూహే ఎంతో ఆనందాన్నిచ్చింది.

ఇక్కడికి రాంగానే సరాసరి వాడి రూమ్‌లోనే దిగాను...

'రాజూ! ఇక్కడున్నావేంటిః' పరిచయమైన గొంతు విన్పించడంతో ఆలోచనల్లోంచి తేరుకుని పక్కకి చూశాను.

ఆశ్చర్యం!

మృణాళిని!

అదే నవ్వు!

మనుషుల్ని, ముగ్ధుల్ని చేసే అందం.

కవ్వించే ఆ కళ్ళలోనే వుంది గొప్ప ఆకర్షణ!

అప్పటికీ, ఇప్పటికీ, ఆమెలో ఏం మార్పులేదు. కాకపోతే వయసుతోపాటు పరిపక్వాని కొచ్చిన చక్కని శరీర సౌష్ఠవం, ఆమె అందం మరింత విజృంభించేటట్లు చేసింది!

ఆమెనలా చూస్తుంటే మతిపోతుంది.

'ఏంటలా చూస్తున్నావ్! నన్ను గుర్తుపట్టలేదాః' ఆశ్చర్యంగా అడిగింది.

'అబ్బే! అదికాదు ... సడెన్‌గా నువ్విలా కన్పించేసరికి ఆశ్చర్యం వేసింది......' తడబడ్డాను.

'నే కాదు సడెన్‌గా దర్శనమిచ్చింది, నువ్వు! మా ఆయన ఇక్కడే ఇ,సి.ఐ.యల్.లో పనిజేస్తున్నారు. మా పెళ్ళై రెండేళ్ళు కావస్తోంది. ఈ రెండేళ్ళనించీ ఇక్కడే మకాం. రాణీగంజ్‌లో వుంటున్నాం. అవునూ, నువ్విక్కడున్నావేంటిః'

'నేనూ ఇక్కడే వుంటున్నాను. ఆంధ్రా బ్యాంకులో వుద్యోగం. ఉద్యోగరీత్యా హైదరాబాద్ చేరుకుని రెండునెల్లు కావస్తోంది. నల్లకుంటలో మరో మిత్రుడితో కల్సి ఓ రూమ్‌లో వుంటున్నాను.'

'—ఇదన్నమాట సంక్షిప్తంగా నీ గురించి' నవ్వింది.

ఆమె నవ్వుతూంటే మరింత ఆకర్షణీయంగా వుంటుంది. ఆమెనలా చూస్తుఉంటే సభ్యతని మర్చిపోతున్నాను!

'నువ్విప్పుడు నాతోపాటు మా ఇంటికి వస్తున్నావ్.' మృణాళిని మళ్ళీ నవ్వింది.

'వస్తాను, కానీ ఇప్పుడు కాదు.'

'మరెప్పుడు?!'

'రేపొచ్చే ఆదివారంనాడు వస్తాను. ఇప్పుడిక్కడో ఫ్రెండుకోసం వెయిట్ చేస్తున్నాను' అన్నాను.

గబగబా బాగ్‌లోంచి ఓ కాగితాన్ని తీసి అడ్రసు రాసిచ్చింది. అక్కడికెలా రావాలో వివరం చెప్పింది.

ఇంతలో ఆమె కావల్సిన బస్సు వచ్చింది.

"వస్తా రాజూ! నువ్వు రేపాదివారం తప్పకుండా రావాలి. నీకోసం ఎదురు చూస్తుంటాను. మాటివ్వాకు." చిన్నగా నవ్వి, బస్సువేపు కదిలింది.

'అలాగే' అని తలూపాను.

ఆమెక్కిన బస్సులోంచే దిగాడు రామచంద్రరావు.

బస్సు బయలుదేరింది.

బస్సు కిటికీలోంచి చేయి బయటికిపెట్టి వస్తానన్నట్లు చేయూపింది మృణాళిని.

అప్రయత్నంగా నేనూ చెయ్యూపాను.

దాదాపు ఆరేళ్ళ తర్వాత మృణాళిని అలా మెరుపుతీగలా కన్పించి మాయమయ్యేసరికి మనస్సు కాస్త కంగు తిన్నదనే చెప్పాలి.

'సారీ బ్రదర్! అనుకోకుండా లేటైపోయింది. పద పద, లైటైపోయింది.' ఇద్దరం గబగబా హాలుకి చేరుకున్నాము.

సినిమాలో హీరోయిన్ చాలా బావుంది. ఆమెని చూస్తుంటే మృణాళినే గుర్తుకొస్తోంది! హాల్లో కూర్చున్నానన్న మాటేగాని ధ్యాసంతా మృణాళిని మీదే వుంది.

దాదాపు నాల్గు సంవత్సరాలు ఇద్దరం కల్సి చదువుకున్నాం. ఇద్దరి ఇళ్ళూకూడా పక్కపక్కనే కావడంతో మా పరిచయం మరింత పెరిగింది. స్కూలుకి కల్సి వెళ్ళేవాళ్ళం. స్కూలు నించి కల్సి వచ్చేవాళ్ళం.

క్లాస్‌లో ఏ సబ్జక్టు చూసినా ఆమె ఫస్ట్! అది ఆమెకన్నా నా కెక్కువ గర్వాన్ని కల్గించేది! నేను స్కూల్ ఫైనల్ పాసయ్యానంటే కారణం ఆమే!

ఆమెక్కూడా అప్పట్లో నేనంటే ఎంతో అభిమానముండేది. ఆ విషయం ఆమె ప్రతిచేష్టలోనూ కొట్టొచ్చినట్లు కనిపిస్తూండేది.

ఆమె ముఖంలో అమాయకతుంది. అందుకే ఆమెని చూస్తూంటే ఒక విధమైన అనుభూతి కల్గుతుండేది. ఆమెని దగ్గరకి తీసుకోవాలని, ఏమేమో చేయాలని అన్పించేది...

ఆరోజు నాకింకా బాగా గుర్తుంది-

తలంటి స్నానంచేసి, కొత్తబట్టలు వేసుకున్నాను. ప్రతి సంవత్సరం పుట్టినరోజునాడు ఇలా తయారవడం నాకు మామూలే.

అమ్మ చేసిన మైసూర్‌పాక్ కేక్స్ తీసుకుని మృణాళిని వాళ్ళింటికి బయల్దేరాను.

నేను వెళ్ళేసరికి మృణాళిని హాల్లో సోఫాలో కూర్చుని ఏదో వీక్లీ తిరగేస్తోంది. ఇంట్లో ఇంకా ఎవ్వరు వున్నట్టు లేరు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

'రా రాజూ! అక్కడే నిలబడిపోయావేం? నీ కోసమే ఎదురు చూస్తున్నాను. నువ్వురాకపోతే నేనే మీ యింటికి వద్దామనుకుంటున్నాను.' చేతిలోవున్న వీక్లీని ఎదురుగా వున్న టీపాయ్‌మీద పడేస్తూ అంది మృణాళిని.

'ఇంట్లో ఎవ్వరూ లేరేంటి?'

'కన్పించడంలా - ఎదురుగా ఇంత మనిషుంటే!'

'నువ్వు సర్లే! మీ అమ్మ, నాన్నగారు, తమ్ముడూ ఎవరూ లేరా?'

'వాళ్ళంతా ఇంతకుముందే బిర్లా టెంపుల్‌కెళ్ళారు.'

'మరి నువ్వెళ్ళలేదే?'

'నన్నూ రమ్మన్నారు. నిన్నే నేను, శకుంతల, గీత కల్సివెళ్ళాం. అందుకనే ఇవాళ రానన్నాను.'

'ఒక్కదానివే ఇలా కూర్చోడానికి బోరు కొట్టడంలా?'

'కాలక్షేపానికి నువ్వొచ్చావుగా' నవ్వింది.

అసలే ఆమె అందం, వంటరితనం నన్ను పిచ్చివాణ్ణి చేస్తోంది. పైగా నవ్వు!

నవ్వుతూంటే ఆమె అందం మరింత విజృంభిస్తుంది! బలవంతాన నాలోని విపరీత భావాల్ని అణచుకొంటూ ఆమె పక్కనే సోఫాలో కూలబడ్డాను.

'ఏంటీవాళ లైట్ కొడుతున్నావ్?' మళ్ళీ నవ్వింది.

ఆమె అందం నాలో ఎంత సంచలనాన్ని కల్గిస్తోందో, నా అందం ఆమెలో అంతే సంచలనాన్ని కల్గిస్తోందన్న విషయాన్ని నేనంతవరకూ పసిగట్టలేకపోయాను. అప్పుడే కొద్దికొద్దిగా అర్థమవుతోంది.

'ఇవాళ నేను పదిహేనో సంవత్సరంలో అడుగుపెట్టాను.' నేనూ నవ్వాను.

'అంటే ఇవాళ తమరి పుట్టింరోజన్నమాట. అందుకే ఇలా ట్రిమ్‌గా తయారై బయల్దేరారన్నమాట!'

'అన్నమాటేంటి వున్నమాటే అది.'

'నీకో పుట్టింరోజు కాన్కివ్వనా?'

'కాన్కిస్తానంటే వద్దని ఎందుకు అంటాను.'

'నిన్నిలా చూస్తుంటే ఏమనిపిస్తోందో తెల్సా? చటుక్కున దగ్గరకు లాక్కుని ముద్దుల్తో ముంచెత్తేయా లనిపిస్తోంది.' నావేపుకి జరుగుతూ అంది.

నే నింతకుముందెన్నోసార్లు ఆమెను దగ్గరకు తీసుకోవాలనుకున్నాను. చేయిలేకపోయాను. ఇవాళ తనంతట తాను చొరవ తీసుకున్నా భయంగానే వుంది!

అమ్మో! ఈ విషయం మా యింట్లో కాని, వాళ్ళింట్లోకాని తెలిస్తే? రెండిళ్ళ మధ్యా రాకపోకలు బందైపోతాయ్. ఆ తర్వాత మృణాళిన్ని చూడకుండాను, మాట్లాడకుండాను కట్టుదిట్టాలు పెరిగిపోతాయ్. ఆమెని చూడకుండా, ఆమెతో మాట్లాడకుండా నేనుండలేను! ఈ క్షణిక సుఖం కోసం శాశ్వతంగా ఆమెను దూరం చేసుకోలేను.

'ఏమిట్రాజూ ఆలోచిస్తున్నావ్? నేనన్నది వినబళ్లేదా?' మరింత దగ్గరగా జరిగింది. దాదాపు నన్ను తాకుతూనే కూర్చుంది. ఆమె అంత

దగ్గర కొస్తే నాలో ఎంత అణచుకోవాలని ప్రయత్నిస్తున్నా ఓ విధమైన చలనం కలగసాగింది. అయినా నాలో వున్న భయం ఆ చలనాన్ని నొక్కిపట్టేస్తుంది. నే నేమాత్రం చొరవ తీసుకున్నా మృణాళిని సర్వస్వాన్ని దోచుకోవచ్చు. కానీ నావల్లకాదు!

'నీకేమన్నా పిచ్చిపట్టిందా ఏంటి?' సోఫాలోంచి లేచి, నించున్నాను.

'నన్నర్థం చేసుకో రాజూ! నువ్వంటే నాకెంతో అభిమానం. ఆ అభిమానానికి చిహ్నంగా చిన్న అనుభూతి. అంతే నే కోరింది.' తనూ లేచి నించుంది.

'ఇవ్వాళ నువ్వేం మాట్లాడుతున్నావో నీకేం అర్థం కావడం లేదు. మనం క్షణికమైన ఆనందం కోసం ఇప్పుడేం తప్పుచేసినా, దాని తాలూకు మచ్చ జీవితాంతం మాసిపోదు గిల్టీ భావం మన మనస్సులో పేరుకు పోతుంది. ఆ తర్వాత మనమింత స్వేచ్ఛగా ఇలా తిరగలేం, మాట్లాడుకోలేం. నువ్వే ఆలోచించు. నేను మళ్ళీ కాసేపుండి వస్తాను.' చేతిలో వున్న స్వీట్స్ అమె చేతిలో పెట్టి, పిలుస్తున్నా వినిపించుకోకుండా గబ గబా వచ్చేశాను.

మనసంతా చికాగ్గా వుంది.

కాసేపా పుస్తకం, ఈ పుస్తకం తిరగేసి తిరిగి మృణాళినీ వాళ్ళింటికి బయల్దేరాను.

మృణాళిని వాళ్ళ అమ్మ, నాన్నగారు వాళ్ళు అప్పుడే గుడినించి వచ్చినట్లున్నారు. నన్ను చూడగానే కూర్చోమని ప్రసాదం పెట్టారు. అప్పుడు తెల్సింది మృణాళిని నాన్నగార్కి హైద్రాబాద్ నించి ట్రాన్స్‌ఫరైందని!

పెద్ద షాక్ తగిలినట్లనిపించింది.

అంటే... అంటే...

మృణాళిని తనకి దూరంగా వెళ్ళిపోతుంది. మళ్ళీ కన్పించక పోవచ్చు... ఈ మాటలనుకుంటేనే మనసు దేవినట్లవుతోంది. బలవంతాన రాబోతున్న కళ్ళనీళ్ళ నాపుకున్నాను.

అందుకే కాబోలు మృణాళిని ఇందాకలా ప్రవర్తించింది: దూరమై పోతున్నామన్న బాధతో అలా అనుంటుంది.

మృణాళిని నాకు దూరంగా వెళ్ళిపోతుంది! మళ్ళీ నాకు కన్పించదు. ఇకముందు మృణాళినెవరో, నేనెవరో! ఈ ఆలోచనల్ని భరించలేక పోయాను.

మళ్ళీ వస్తానంటూ గబగబా ఇంటికొచ్చేసి, అలాగే మంచంమ్మీద పడుకున్నాను. ఆ రోజెవ్వరితోనూ మాట్లాడబుద్ధిపుట్టలేదు.

వెళ్ళిపోయేటప్పుడు మృణాళిని చూసిన ఆ చూపు నాకిప్పటికీ బాగా గుర్తుంది. ఆ చూపులో ఎంత బాధ, వేదన!

ఆ తర్వాత కొన్నాళ్ళు మా ఇద్దరిమధ్యా వుత్తరాలు నడిచాయి. వున్నట్టుండి వుత్తరాలుకూడా ఆగిపోయాయి.

తిరిగి మళ్ళీ ఇన్నాళ్ళకి ఇలా కన్పించింది.

అప్పటికీ, ఇప్పటికీ ఆమెలో శారీరకంగా తప్ప మరే మార్పులేదు. నేనంటే తనకున్న అభిమానం, ఆరాధన ఇంకా అలాగే వున్నాయ్. నన్ను చూడగానే ఆమె కళ్ళలో మెరిసిన మెరుపే దానికి తార్కాణం.

మానసికంగా మగవాడికన్నా ఆడవాళ్ళే ముందు పెరిగిపోతారన్న మాట వాస్తవం! ఆరోజున ఆమె అడిగినా నేనే దూరంగా వుంచాను. కాని ఇప్పుడు...ఇప్పుడు...నో...ఆమెని దూరంగా నెట్టివేయలేను. మతి పోగొట్టే ఆ అందాన్ని అనుభవించి తీరుతాను.

'ఒరేయ్! సిన్మా చూస్తున్నావా? నిద్రపోతున్నావా?' భుజం పట్టుకుని కదిలించాడు రామచంద్రరావు.

'అబ్బే! చూస్తూనే వున్నాను...' మనసుని బలవంతాన మృణాళిని వేపునించి మరల్చాను.

ఆ రాత్రల్లా కూడా సరిగా నిద్రపట్టలేదు. మృణాళిని గురించి ఆలోచిస్తూ ఎప్పుడు నిద్రపోయానో నాకే తెలీదు!

మర్నాడాఫీసునించి సరాసరి మృణాళిని ఇంటికి బయల్దేరాను.

నేనెళ్ళేసరికి హాల్లో పడక్కుర్చీలో పడుకుని ఏదో వారపత్రిక తిరగేస్తోంది.

'అరే! ఇంత తొందరగా దయ కల్గిందే మా మీద!' నన్ను చూడగానే నవ్వుతూ కుర్చీలోంచి లేచింది.

'ఏమిటీ అలా నిలబడిపోయావ్! ఇలా వచ్చికూర్చో.' తన కుర్చీలో తిరిగి కూర్చుంటూ మరో కుర్చీ చూపిస్తూ అంది.

కూర్చున్నాను మాట్లాడకుండా.

'ప్రతి గురువారం మౌనవ్రతం పాటిస్తావేంటి?'

'అబ్బే! అదేంకాదు...వయసుతోపాటు పెరిగిన నీ అందం చూస్తుంటే మతిపోతోంది.' ధైర్యంగా అనేశాను.

'అబ్బో ఫర్లేదు! అబ్బాయిగారికీమధ్య ధైర్యంకూడా వచ్చేసినట్లుందే!' చిన్నగా నవ్వింది.

అంటే...ఆమె అప్పటి నా ప్రవర్తన్ని ఇంకా మర్చిపోలేదన్న మాట! అవున్లే ఎలా మర్చిపోతుంది?

'ఎప్పుడూ అలాగే వుంటామా? వయసుతోపాటు పెరగమూ!' అవునూ- మీ ఆయనింకా రాలేదా?' ఆయ నెప్పుడొస్తాడో తెల్సుకోవడం ముందవసరం. అందుకే ఆ ప్రశ్నడిగాను.

'ఆయనొచ్చేసరికి ఆరు దాటుతుంది. ఓ అరగంట ఓపిక పట్టు. ఆయన్ని చూడొచ్చు.'

అరగంట కాదుకదా అయిదు నిముషాలు కూడా ఓపికపట్టలేను. నేనాయన్ని చూట్టానికి రాలేదిక్కడికి. నాకోసం ఎదురు తెన్నులు చూసే అందాన్ని అందుకుని అనుభవించడానికి వచ్చాను. అలస్యం అమృతమ్ విషమ్,. లేవబోయాను.

'వన్ మినిట్ ఇప్పుడే కాఫీ తీసుకొస్తాను.' మృణాళిని లోపలి కెళ్ళింది.

ఆమెతోపాటే వంటింట్లో కెళ్ళాను.

'ఆఁ ఇంకా ఏంటీ సంగతులు?' ఫ్లాస్కందుకుంటూ అడిగింది.

'ఏమున్నాయ్? అంతా మామూలే?' ఇది మాటలకి సమయం కాదు. ఒక్కో క్షణం ఎంతో అమూల్యమైంది. మనసు తొందరపడుతోంది.

'నిజంగా నిన్ను నా జన్మలో మర్చిపోలేను రాజూ!' కాఫీని రెండు గ్లాసుల్లో పోసి ఒకటి నా కందిస్తూ అందామె. 'నిన్నూ ఇకముందు నేను మర్చిపోలేను మృణాళినీ! ఇన్నాళ్ళ నా నిర్లక్ష్యానికెంతో బాధపడు తున్నాను!' నాలో నేనే అనుకున్నాను.

'అంతవరకూ నీకన్నా నేనెంతో తెలిసిందాన్నని గర్వపడుతుండే దాన్ని! ఆ రోజు నీ ప్రవర్తన చూసింతర్వాత నా గర్వమంతా అణిగి పోయింది. నువ్వా రోజు ఏమాత్రం అవకాశం తీసుకున్నా నా జీవితం సర్వనాశనమైపోయేది. నీ మాటలో ఎంతో సత్యముంది. ఆ రోజు మనం తొందరపడుతుంటే ఇవాళింత సుఖంగా ఇలా మాట్లాడుకోగల్గి వుండే వాళ్ళంకాదు. గిల్టీకాన్షన్‌తో నిన్ను చూసినా నేను తప్పించుకుని వెళ్ళిపోయే దాన్నేమో! నిన్న నిన్నక్కడ చూడగానే నాకెంత ఆనందంగా అన్పించిందో

తెల్సా? వర్ణించలేను. నీలాంటి మంచి మనిషిని స్నేహితుడిగా పొందినందుకు నేనెంతో గర్వపడుతున్నాను.' ఆమె కళ్ళలో ఓ విధమైన గర్వం తొణికిసలాడుతోంది.

ఆ కళ్ళలోకి చూడలేకపోయాను.

ఎక్కడికో పాతాళంలోకి దిగబడిపోతున్నట్లనిపించసాగింది. నాలోని పిశాచం సిగ్గుతోటి ఎగిరిపోయింది. ఆమె ముఖంలోకి చూడాలంటేనే సిగ్గేస్తోంది! తను మంచి మనిషి! అసలు తనే వుద్దేశంతో ఇక్కడికొచ్చాడు? ఆవిడ మంచితనాన్ని ఎంత అసహ్యంగా అర్థం చేసుకున్నాడు! అలాంటి మూర్ఖుడిలో కూడా మంచి మనిషినే చూసి, ఆ మనిషిలోని మూర్ఖత్వాన్ని పారద్రోలిన మంచి మనిషి తను!

'నువ్వు కాదు, నీలాంటి మంచి మనుషుల స్నేహానికి నోచుకున్న నేను గర్వపడాలి. వస్తా మృణాళినీ!' కాఫీ గ్లాసు కింద పెట్టి బయల్దేరాను.

'అదేంటి! ఆయనొచ్చేదాక వుండవా? నీ గురించి ఆయనకెంతో గొప్పగా చెప్పాను. నువ్వొచ్చి కనబడకుండా వెళ్ళావని తెలిస్తే బాధ పడతారు.'

'ఇవాళ ఆరు గంటలకో మనిషిని సికింద్రాబాద్ స్టేషన్ దగ్గర కల్సుకోవాలి. పోతూ పోతూ దార్లో ఇలా వచ్చాను. మళ్ళా ఆదివారం నాడు వస్తాను.' గబగబా బయట కొచ్చేశాను. ఈ మూడ్రోజుల్లో నైనా నాలో వున్న నీచ భావాల్ని బయటికి తరిమేయడానికి ప్రయత్నించాలి! *

(స్నేహ మాసపత్రిక-ఫిబ్రవరి 1978)